పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పరామర్శ

మిర్యాలగూడలో ఓ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, జూలై 25: దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన ఎర్రబోయిన కోటయ్యయాదవ్(50) రోడ్డు ప్రమాదంలో, కొండ్రపోల్ గ్రామానికి చెందిన రాయికింది గోపాల్(51) అనుమానాస్పదంగా మృతి చెందారు ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలి ంచగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు గురువారం వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామ ర్శించారు. ఆయన వెంట డీసీఎంఎస్ జిల్లా వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్లు బైరం సంపత్, కుందూరు వీరకోటిరెడ్డి, జెర్రిపోతుల రాములుగౌడ్, కాశయ్య, హనిమిరెడ్డ, రమావత్ వినోద్, వీరబాబు, నాగేశ్వర్‌రావు, గోపాలకృ ష్ణ ఉన్నారు.

● మిర్యాలగూడ(వేములపల్లి): ద్విచక్ర వాహనంపై కిందపడి గాయాలపాలై సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వేములపల్లి మండల కేంద్రానికి చెందిన పందిరి ప్రతాప్‌ను గురువారం మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ప్రతాప్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట చిర్ర మల్లయ్య యాదవ్, మాలి శంకర్‌రెడ్డి, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, నాగవెల్లి శంకర్, గుండెబోయిన లక్ష్మయ్య, పందిరి శ్రీనివాస్, మన్నెం శివ, పందిరి ప్రతాప్, సురేందర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పక్కదారి పడితే చర్యలు

● జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి

కతాల్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న సంక్షేమ అధికారి సక్కుబాయి

నీలగిరి, జూలై 25 : ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి సక్కుబాయి హెచ్చరించారు. కతాల్‌గూడలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో స్టాక్, రికార్డుల్లో ఉన్న స్టాక్‌ను లెక్కించారు. రికార్డులు చాలా శుభ్రంగా ఉంచుకోవాలని, కొట్టివేతలు ఉండవద్దని, వైట్‌నర్లు వాడరాదని తెలిపారు. కార్యక్రమంలో షేర్‌బంగ్లా సూపర్‌వైజర్ మల్లేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఎంజీబీ

అవగాహన కల్పిస్తున్న సీఎమ్‌జీబీ అంజనేయులు

కొండమల్లేపల్లి, జూలై 25 : విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చీఫ్ మేనేజర్ జనరల్ బ్యాంకు (సీఎంజీబీ) ఆంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ కాంతి జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఆర్‌బీఐ, సీఎఫ్‌ఎల్ సంస్థల ఆధ్వర్యంలో ఆర్థిక , 'అక్షరాస్యత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంకులు అందిస్తున్న వివిధ రకాల సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలుపాలని, అనంతరం సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్, ప్రసన్నకుమారి, ఎస్‌బీఐ మేనేజర్ సందీప్, కళాశాల ప్రిన్సిపల్ అశోక్, అంకులమ్మ, మహేశ్ పాల్గొన్నారు.

అడ్డుగోడ తొలగించాలని కాలనీవాసుల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

మిర్యాలగూడ, జూలై 25 : రాకపోకలు సాగించకుండా గ్రామంలో నిర్మించిన అడ్డుగోడను తొలగించాలని బీసీ కాలనీవాసులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. మిర్యాలగూడ మండలం జేత్యా తండా గ్రామపంచాయతీ పరిధిలోని బీసీ కాలనీకి వెళ్లే దారిపై కొందరు అడ్డుగోడ కట్టడంతో తాము రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవి ంచినా ఫలితం లేకుండా పోయిందన్నారు. గోడను తొలగించి తమ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కార్యక్రమంలో బీసీ కాలనీవాసులు ఉన్నారు.

కుక్కల దాడిలో నెమలి మృతి

మృతిచెందిన నెమలి

మిర్యాలగూడ, జూలై 25: పట్టణంలోని ఇస్లాంపురంలో జనావాసాల్లోకి వచ్చిన జాతీయ పక్షి నెమలిపై కుక్కల దాడి చేయడంతో గాయపడి మృతి చెందింది. ఇస్లాం పురంలో నెమలిపై వీధి కుక్కలు దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని పరీక్షించి నెమలి మృతి చెందినట్లు నిర్ధారిం చారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకొని కాల్వపల్లి అటవీప్రాంతంలో ఖననం చేశారు. కాగా నెమలి ఎలా వచ్చిందనేది ప్రశ్నగా మారింది.

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలి

● ఆగస్టు 15 నాటికి పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలి ● కలెక్టర్ నారాయణరెడ్డి

నార్కట్‌పల్లి : డిజిటల్ బోధన తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 25 : ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది వంద శాతం ఉత్తీర్ణత సాధించి, 10 జీపీఏ సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. మండంలోని ఎల్లారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారంఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వంట గది, తాగునీటి సౌకర్యం, ప్రహరీ, పాఠశాల ఆటస్థలం, టాయిలెట్స్ తదితర సౌకర్యాలు పరిశీలించారు. తాగు నీటి, తరగతి గదుల మరమ్మతు పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కలెక్టర్ దృష్టికి తీసురాగా వీటన్నిటిని ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు పాఠశాల ప్రహరీ ఎత్తు పెంచాలని, రాత్రి సమయాల్లో పాఠశాలలోకి జులాయిలు వస్తున్నారని, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ముందుగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులను పూర్తి చేసిన తర్వాత రెండో విడుత మిగిలిన సమస్యలన్నింటిపై దృష్టి సారిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. బయోలాజికల్ సైన్స్ పాఠం జరుగుతుండగా డిజిటల్ విధానం ద్వారా పిల్లల పరిజ్ఞానాన్ని, డిజిటల్ బోధన తీరును ఆయన పరిశీలించారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా బాగా చదువుకోవాలని పిలుపునిచ్చా రు. ఆయనవెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

చెర్వుగట్టు వచ్చే భక్తులకు వసతులు కల్పించాలి

చెర్వుగట్టు ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు. చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం దేవాలయ కార్యనిర్వాహక అధికారి గదిలో ఆలయ అధికారులతోపాటు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. చెర్వుగట్టుకు వచ్చే భక్తుల గురించి వారికి అందించే సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెర్వుగట్టు వచ్చే రహదారులు, ఘాట్ రోడ్డు సైతం డబుల్ రోడ్డు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అలాగే చెర్వుగట్టు పైకి తాగునీటి పైప్‌లైన్ తోపాటు, డిస్ట్రిబ్యూషన్ విధానాన్ని పక్కాగా ఏర్పాటు చేసేందుకు పూర్తి స్థాయిలో శాశ్వత ప్రణాళిక రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. అమావాస్య రోజు వచ్చే భక్తుల కోసం అవసరమైనన్నీ టాయిలెట్లు, వసతికి, వాహనాల పార్కింగ్‌కు సైతం ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు సమావేశంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మహేం కుమార్, ఈఓ నవీన్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఈఈ భూమన్న, ఎంపీడీఓ ఉమేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు : ఆర్డీఓ

పెద్దఅడిశర్లపల్లి, జూలై 25 : విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు అన్నారు. పీఏపల్లి తాసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొద్ది రోజులు కార్యాలయం రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం, ధరణి పెండింగ్ పనులపై సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. తక్షణమే సిబ్బందికి సెక్షన్లు కేటాయించాలని తాసీల్దార్ ఆదేశించారు. అనంతరం మేడారం గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తాసీల్దార్ శివ శంకర్ ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

దామరచర్ల, జూలై 25: అప్పుల బాధతో గురువారం వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వాడపల్లి ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొండ్రపోల్ గ్రామానికి చెందిన రాయికింది గోపాల్ (51) దామరచర్లలో పలు వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నష్టపోయాడు. ఈ క్రమంలో అప్పులు ఇచ్చిన వారు వేధిస్తుండగా తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు మిర్యాలగూడ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి

దామరచర్ల, జూలై 25 : డీసీఎం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో మండలంలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు.. వాడపల్లి ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం వీర్లపాలెం గ్రామానికి చెందిన ఎర్రబోయిన కోటయ్య ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా మిర్యాలగూడ నుండి గుంటూరు వైపునకు వెళ్తున్న డీసీఎం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న వాడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం 108లో మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ కోటయ్య మరణించాడు. మృతుడి కుమారుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫొటోగ్రఫీ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కొండమల్లేపల్లి, జూలై 25 : ఈ నెల 26,27,28 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ స్టేడియంలో నిర్వహించే ఫొటోగ్రఫీ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ వాల్ పోస్టర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఎస్ఐ రాంమ్మూర్తి అవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు గంధం సురేశ్, గౌరవ అధ్యక్షుడు సయ్యద్ పాషా, ప్రధాన కార్యదర్శి చీరంబాబు, కోశాధికారి బొడిగె శంకర్‌గౌడ్, ల్యాబ్ సతీశ్, మురళి, శ్రీనివాస్, రమేశ్, వెంకట్, రాజు, పరమేశ్, రాకేశ్, కిరణ్, మహేశ్, కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గుడిపల్లి మండలాధ్యక్షుడిగా వంశీ

పెద్దఅడిశర్లపల్లి, జూలై 25 : ఎమ్మార్పీఎస్ గుడిపల్లి మండలాధ్యక్షుడు ఎర్ర వంశీకి సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కంబాలపల్లి వెంకటయ్య నియామక పత్రాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో మాతంగి కాశయ్య, ఎర్రయాదగిరి, పోతెం సహదేవుడు, సాయి, అడెపు సైదులు ఉన్నారు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించాలని వినతి

మిర్యాలగూడ, జూలై 25: మిర్యాలగూడ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించాలని కోరుతూ బీసీ సంఘం నాయకులు డిప్యూటీ డీఎంహెచ్ఓ సింహాద్రి గీతావాణికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ చాలా కాలంగా మిర్యాలగూడలో అవసరమైన వారికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించడం లేదని అన్నారు. కార్యక్రమంలో చేగొండి మురళీయాదవ్, దాసరాజు జయరాజు, నిడిగొండ వెంకటేశం, బీరప్ప, కుమార్, భిక్షంయాదవ్, వెంకయ్య, సత్యనారాయణరెడ్డి, వాసుదేవిరెడ్డి పాల్గొన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

● సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు ఆర్డీ కృష్ణమూర్తి

మాట్లాడుతున్న రీజినల్ డైరెక్టర్ కృష్ణమూర్తి

రామగిరి, జూలై 25: భూగర్భ జలాల పరిరక్షణకు ప్రజలంతా బాధ్యతగా భాగస్వామై క్రియాశీలకంగా వ్యహరించాలని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజినల్ డైరెక్టర్ జి.కృష్ణమూర్తి తెలిపారు. నల్లగొండలోని ఎంజీయూలో డిపార్టుమెంట్ ఆఫ్ జియాలజీ, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు సంయుక్తంగా మూడ్రోజుల శిక్షణలో భాగంగా గురువారం రెండో రోజు హాజరై మాట్లాడారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో భూగర్భ జలాలు, ఫ్లోరోసిస్ తదితర అంశాలపై స్ఫూర్తి నింపేలా అవగాహన కల్పించారు. జలసాధన సమితి అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో వర్షపాతం, ఫ్లోరోసిస్ తదితర అంశాలను వివరించారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి : ఎంపీడీఓ

మినీ గురుకులంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయకుమారి

త్రిపురారం, జూలై 25 : ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ విజయకుమారి సూచించారు. మండల కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, సమీకృత వ్యాధిగ్రస్తుల కుటుంబాలను గురువారం ఆమె సందర్శించి వారితో మాట్లాడారు. గర్భం దాల్చినప్పటి నుంచి డెలివరి అయిన సంవత్సరం వరకు ప్రభుత్వం పీహెచ్‌సీ నుంచి లభించే అన్ని సదుపాయాలను సద్వినియోగించుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న గిరిజన మినీ గురుకులంను ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించారు అనంతరం విద్యార్థులతో మాట్లాడి చదువుపై విద్యార్థులను ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో ఎంపీఓ భిక్షంరాజు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి : సీపీఎం

కొండమల్లేపల్లి : మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

కొండమల్లేపల్లి, జూలై 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ లక్ష్మీ నారాయణ అన్నారు. స్థానిక సాయికృప ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు చేసిన కేటాయింపులకు పొంతనలేదని హామీలు అమలు చేయకపోతే భవిష్యత్తులో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్, పీఏపల్లి, చింతపల్లి, చందంపేట, మండల కార్యదర్శులు పెరిక విజయ్‌కుమార్, ఉడుగుండ్ల రాములు, శ్రీను, కావలి కృష్ణయ్య, పోలే యాదయ్య, కంబాలపల్లి చిరంజీవి, లక్ష్మమ్మ, సువాసిని, దొసపాటి విజయ పాల్గొన్నారు.

సీత్లాతండాలో హెల్త్ సర్వే

తిరుమలగిరి(సాగర్), జూలై 25: మండలంలోని సీత్లా తండాలో వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలకు హెల్త్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ సతీశ్, ఏఎన్ఎం కె.సరితలు గ్రామంలో గర్భిణులు, బాలింతల ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు.

మాలమహానాడు సోషల్ మీడియా కన్వీనర్‌గా బాలసైదులు

నియామక పత్రం అందజేస్తున్న బాలకృష్ణ

కట్టంగూర్, జూలై 25 : మాలమహానాడు సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా కట్టంగూర్‌కు చెందిన గోగు బాల సైదులు నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు చింతపల్లి బాలకృష్ణ ఈ మేరకు గురువారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలసైదులు మాట్లాడుతూ మండలంలో సంఘం బలోపేతానికి సోషల్ మీడియా ద్వారా కృషి చేస్తానని తెలిపారు. నియమించిన బాలకృష్ణ సహకరించిన తాళ్లపల్లి రవి, జోసఫ్, నరేశ్, వినోద్, అనిల్ వెంకన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల కార్యవర్గం

నూతన కార్యవర్గం

చిట్యాల, జూలై 25 : ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల కమిటీని గురువారం జిల్లా గౌరవాధ్యక్షుడు ఏళ్ల బయ్యన్న, జిల్లా సహాయ కార్యదర్శి ముప్ప సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతనఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవనబోయిన సైదులు, ప్రధాన కార్యదర్శిగా కూరాకుల సుధీర్, కోశాధికారిగా చొప్పరి లింగస్వామి, సలహాదారుడిగా గాలా యాదగిరి, మెండె నర్సింహ, ఉపాధ్యక్షుడిగా బయ్యా రవి, సిలువేరు రమేశ్, సత్తయ్య, నరేశ్, సహాయ కార్యదర్శులుగా అచ్చయ్య, శేఖర్, వేణు, ప్రచార కార్యదర్శిగా జిట్ట నరేశ్, కార్యవర్గ సభ్యులుగా ఉపేందర్, ప్రణయ్, మల్లేశ్ ఎన్నుకున్నారు.

గాయకుడు నరేశ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

● ఎమ్మెల్యేలు సామేల్, వీరేశం, బీఎల్ఆర్

నరేశ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం

శాలిగౌరారం, జూలై 25: అకాల మరణం పొందిన తెలంగాణ మలి దశ గాయకుడు వేముల నరేశ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తుంగతుర్తి, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఊట్కూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన నరేశ్ సంతాప సభలో వారు పాల్గొని మాట్లాడారు. నరేశ్ మంచి కళాకారుడిని, ఎంతో మంది ప్రజలను తన పాటలతో చైతన్యవంతం చేశారని కొనియాడారు. నరేశ్ మరణం కళారంగానికే తీరని లోటు అన్నారు. అంతకు ముందు నరేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాటల సీడీని ఆవిష్కరించారు. అంతకు ముందు శాలిగౌరారం గ్రామానికి చెందిన మామిడిపెల్లి మాధవి మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజిని, ఎమ్మెల్యే వీరేశం సతీమణి వేముల పుష్ప, వేపూరి సోమన్న, అన్నెబోయిన సుధాకర్, బొడ్డు సోమలింగయ్య, నోముల జనార్దన్, వేముల గోపినాథ్, పడాల రమేశ్, పుల్లూరి దేవేందర్, జహంగీర్, నూక కిశోర్, ఈర్ల కిరణ్, వేముల భరత్ ఉన్నారు.

చర్లగౌరారం మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి మృతి

● నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నీలగిరి, జూలై 25: కనగల్ మండలం చర్లగౌరారం మాజీ ఉపసర్పంచ్ తుమ్మల నారాయణరెడ్డి గురువారం మృతి చెందారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీ కరీం పాషా, మాజీ ఎంపీటీసీ బోయపల్లి జానయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మాజీ సర్పంచులు చింతల యాదగిరి, కడారి కృష్ణయ్య, నాయకులు బ్రహ్మయ్య, దశరథ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు ఉన్నారు.

మిర్యాలగూడ డిపో మేనేజర్లకు సన్మానం

మిర్యాలగూడ కొత్త డీఎం రామ్మోహన్‌రెడ్డి, బదిలీపై వెళ్తున్న డీఎం పాల్‌ను సన్మానిస్తున్న సన్మానిస్తున్న నాయకులు

మిర్యాలగూడటౌన్, జూలై 25 : మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో డీఎంగా బాధ్యతలు చేపట్టిన రామ్మోహన్‌రెడ్డి, బదిలీవుతున్న డీఎం పాల్‌లను బీఆర్టీయూ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆటో మోటార్స్ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ నాజర్ అలీ మాట్లాడుతూ మేనేజర్ పాల్ డిపోకు ఎనలేని సేవ చేశారన్నారు. 2020–21,2022–23 సంవత్సరానికి రాష్ట్రంలో నంబర్‌వన్ డిపోగా అవార్డు రావడంలో ఆయన కృషి ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు చోటు, సెక్రటరీ అఖిల్, బస్టాండ్ అడ్డా ఆటోడ్రైవర్లు గబ్బర్, యూసు ఫ్, పర్వేజ్, సైదులు, మజీద్, లక్ష్మీనారాయణ, సయ్యద్ పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

మొక్కలు పంపిణీ చేస్తున్న పంచాయతీ అధికారి సత్యనారాయణ

చిట్యాల, జూలై 25 : వన మహోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి సిద్దీవీర సోమయ్య, వైద్యాధికారి మాధవి, ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి రమేశ్ పాల్గొన్నారు.

లక్పతి తండాలో తీజ్ ఉత్సవంలో పాల్గొన్న మహిళలు, గ్రామస్తులు

ఘనంగా తీజ్ ఉత్సవం

త్రిపురారం, జూలై 25: మండలంలోని నడిమితండా, లక్పతితండాల్లో ఉమ్మడిగా బంజారా తీజ్ ఉత్సవ్ ఘనంగా నిర్వహించారు. 9 రకాల విత్తనాలను మొలకలుగా ఏర్పాటు చేసి 9వ రోజు నిమజ్జనం చేసే తీజ్ కార్యక్రమం గిరిజనులకు అత్యంత సంప్రదాయమైందని గిరిజనులు అన్నారు. పెళ్లికాని ఆడపడుచులు మొలకెత్తిన నారును ఎత్తుకొని ఆటపాటలతో నృత్యాలు చేసుకుంటూ ఉత్సవం ఘనంగా నిర్వహిస్తారని, ఉమ్మడి లక్పతితండాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ధనావత్ భారతీ భాస్కర్‌నాయక్, పద్మ, రాంకోటినాయక్, మాజీ సర్పంచ్ సేవ్యానాయక్, హర్యానాయక్, సోమాని, విద్యాసాగర్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచెయ్యి : ఎస్ఎఫ్ఐ

హాలియా, జూలై 25 : కేంద్ర ప్రభుత్వంప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చెయ్యి చూపించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేశ్ అన్నారు. గురువారం హాలియా సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యావిధానం అంటూనే విద్యారంగానికి నిధులు కేటాయించకపోవడంతో బాధకరం అన్నారు. గతేడాది ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు ప్రస్తుత బడ్జెట్‌కు మధ్య ఒక్కశాతం నిధులను మాత్రమే పెంచారని అన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు జగదీశ్, కోరే రమేశ్, జానీ, వర్షిత్, నాగరాజు, సంతోష్, చరణ్, పవన్ తదితరులున్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన బొమ్మరబోయిన రమేశ్, తండ్రి మల్లయ్య, వయస్సు:32 సం॥ వృత్తి, సివిల్ కాంట్రాక్టర్, నివాసం కస్తాల గ్రామం, చండూర్ మండలం, నల్లగొండ జిల్లా గారు ఇచ్చు ప్రకటన ఏమనగా నేను కొనుగోలు చేసినటువంటి ఖాళీ ప్లాట్ యొక్క ఒరిజినల్ దస్తావేజు నం.6660/2019, దాని యొక్క లింకు దస్తావేజు నెం.4648/2005. Dated:21-07-2005 SRO-Chandur ద్వారా సంక్రమించినది. ఇట్టి లింకు దస్తావేజు కస్తాల నుండి చండూర్‌కు వెలుచుండగా మార్గమధ్యములో పోయినది ఇట్టి విషయమై చండూర్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు నమోదు చేసినారు సదరు ఆస్తి యొక్క వివరములు ఖాళీ ప్లాట్ Part No.35 & 36, (Plot No.35 area 73.33 Sq. Yards & Plot No.36 area 146.66 Sq.Yards) సర్వే నం.70, విస్తీర్ణం 220.00 చదరపు గజములు=183.93 చదరపు మీటర్లు కొత్తగా డెవలప్ చేసినటువంటి ఏరియా, చండూర్ గ్రామం & మండలం, నల్లగొండ జిల్లా సదరు ఆస్తి యొక్క హద్దులు ఉత్తరం: ప్లాట్ నం.37, దక్షిణం: వెంకటయ్య గారి పార్ట్ ఆఫ్ ప్లాట్ నం.35, తూర్పు:20.00 వైడ్ రోడ్డు, పడమర:ప్లాట్ నం.41 & 42, ఎవ్వరికైనను పై దస్తావేజులు దొరికినచో నా క్లైంటుకు తిరిగి ఇవ్వగలరు. ఇట్టి విషయంపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంతరములున్నచో తగిన ఆధారములతో (7) వారం రోజులలో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌లో సంప్రదించగలరు.

సం/- నాంపల్లి చంద్రశేఖర్
న్యాయవాది & నోటరీ
ఇంటి నం.6-2-439/1, శ్రీనగర్ కాలనీ,
నల్లగొండ–508001, తెలంగాణ,
సెల్: 9440422393

నల్లగొండ
తేది:24-07-2024